అభివృద్ధి పనులకు గ్రహణం!

● నత్తనడకన నాలుగో ప్లాట్‌ఫాం విస్తరణ పనులు ● డ్రైనేజ్ ఔట్‌లెట్ లేక నిలిచిన వర్షపునీరు
● దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవస్థలు


అసంపూర్తి పనుల వల్ల నిలిచిన వర్షపునీరు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా మారాయి. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రూ. 26 కోట్లతో స్టేషన్ అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు గతేడాది ఆగస్టులో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు మందకొడిగా సాగాయి. ఎన్నికలకు నెల ముందు నుంచి ఈ పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

సత్తేనయం

సుమారు మూడున్నర కోట్లతో నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం బయట నాగదేవత కొండ నుంచి కొం


నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు అస్తవ్యస్తంగా ఉన్న దృశ్యం


దువ్వాడ రైల్వే స్టేషన్

డ చరియలు జారిపోకుండా ఉండేందుకు రక్షణ గోడ, డ్రైనేజీ నిర్మాణంతో వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచి నాగదేవత కొండ మెట్ల మార్గం వరకు రహదారి విస్తరణ, బస్‌బే పనులు ప్రారంభించారు. అయితే డ్రైనేజీ ఔట్‌లెట్ పనులు, బస్‌బేల నిర్మాణంతో పాటు రహదారి విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు మధ్యలో నిలిచిపోయి మురుగు కూపంలా మారిపోయింది.దీంతో ఆ ప్రాంతంలోవాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సిటీ బస్‌లు కూడా బస్టాప్ వద్ద కాకుండా ముందుకు నిలపాల్సి వస్తుంది. ఇక గాజువాక మండలంలోని అనేక గ్రామాల నుంచి సబ్బవరం మండల గ్రామాలకు వెళ్లడానికి నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తున్నారు. పనులు అస్తవ్యస్తంగా ఉన్న కారణంగా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఒకటో నంబర్‌ప్లాట్‌ఫారం వైపు కొత్త స్టేషన్ అడ్మిన్ భవనం, టికెట్ బుకింగ్ కౌంటర్, పీఆర్ఎస్ కౌంటర్, వెయింటింగ్ హాలు నిర్మాణ పనులు వారం రోజుల కిందట ప్రారంభించారు. అయితే నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వేలాది మంది స్థానికులు అగచాట్లు పడుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



రహదారి విస్తరణ పనులు తక్షణమే పూర్తి చేయాలి. గతంలో ఈ మార్గంలో వాహనాల రద్దీ తక్కువగా ఉండేది. రెండేళ్ల నుంచి ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పాటు సిటీ బస్ సౌకర్యాలు రెట్టింపు అవ్వడంతో పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దిగిపోతున్నారు. ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో వారి గమ్యస్థానాలకు ముందుగా చేరుకుంటున్నారు. రహదారి విస్తరణ, ఇతర పనులు మధ్యలో వదిలేయడం వల్ల అసౌకర్యానికి గురికావాల్సి వస్తుంది.

– పట్టా రామ అప్పారావు, కొండయ్యవలస

నాలుగో ప్లాట్‌ఫారం వైపు పనులు పూర్తి చేయాలి



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పనులు తొందరగా పూర్తి చేయాలి. ప్లాట్‌ఫారం నుంచి నేరుగా రోడ్డు మీదకు ప్రయాణికులు వస్తున్నారు. రైళ్లు వచ్చే సమయంలో వందలాది మంది ప్రయాణికులు లగేజీలతో రోడ్డులో నిల్చోవాల్సివస్తుంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రోడ్డు ఇరుగ్గా మారింది.

– చట్టి తాతారావు, వెదుళ్లనరవ

క్లుప్తంగా

మానవ సేవలో తరించడమే లక్ష్యం


మొక్క నాటుతున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, తిరుమలనగర్ ప్రతినిధులు

అగనంపూడి: మానవ సేవలో తరించడమే సత్యసాయి మార్గమని సత్యసాయి ధ్యానమందిరం ప్రతినిధులు, తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం అన్నారు. 87వ వార్డు తిరుమలనగర్‌లో శ్రీసత్యసాయి భజన మండలి, వడ్లపూడి, కేవీకే సమితి సహకారంతో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు ఆధ్యాత్మిక సేవలో తరిస్తూనే మరోపక్క మానవసేవ చేస్తున్న సత్యసాయి భజన మండలి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయి, తిరుమల నగర అసోసియేషన్ల ప్రతినిధులు రమేష్, తిరుపతినాయుడు,సన్యాసిరావు, అప్పలనాయుడు, రాధాకృష్ణ, పరమేశ్వరరావు, రాము, భాస్కరరావు, రాజు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా గాజువాక


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: గాజువాకను ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 67వ వార్డులో రూ.2 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాకలో ఇప్పటికే ఉన్న సమస్యలను గుర్తించామని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీలు నిర్మించడంతోపాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పల్లా రంగా, కె.సింహాచలం, గొలగాని గోపి, చిత్రాడ అప్పారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

210 మందికి వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెంలోని ఏ ప్లస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 210 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చైతన్య వర్మ, వైద్యులు వెంకటాచలం, పావని, జ్యోత్స్న, మనోహర్ సేవలు అందించారు. లయన్స్‌క్లబ్ కూర్మన్నపాలెం కమిటీ సభ్యులు సుబ్బరాజు, శ్రీనివాసు, శివరామకృష్ణ, రామరాజు, ప్రసాద్, శంకరరావు, సూర్యనారాయణ సహకరించారు.

నెలాఖరు వరకు బీజేపీ సభ్యత్వ నమోదు


నూతన సభ్యత్వాలను నమోదు చేస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: బీజేపీ సభ్యత్వాలను ఈ నెలాఖరు వరకు నమోదు చేస్తామని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. గాజువాకలో చేపట్టిన సభ్యత్వ నమోదును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఇప్పటివరకు 23 వేల మంది బీజేపీ సభ్యులుగా చేరారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, అనురాగ్ సింగ్, రాహుల్‌షా, జగదీష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కిరెడ్డిపాలెం:అక్కిరెడ్డిపాలెం–నాతయ్యపాలెం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెడికవర్ హాస్పటల్, పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 302 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. బీజేపీ నాయకుడు జి.సుబ్రహ్మణ్యం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వీరిలో 24 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. వారికి ఆపరేషన్లు చేయడంతో పాటు ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే ఈసీజీ, బీపీ, బరువు, ఎత్తు, రాండమ్ బ్లడ్ షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వినికిడి సమస్యలు, రీచ్ హెల్త్ ఆక్యుపంక్చర్ వైద్య


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సేవలను హెచ్ఆర్ వి.అన్నపూర్ణ, వి.హరిణి నేతృత్వంలో అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ వి.వి.గుప్తా, అధ్యక్షుడు నున్న గాంధీ గుప్తా, కార్యదర్శి జి.కుమార స్వామి, కోశాధికారి నున్న శ్రీరామ్మూర్తి, డీపీవో వి.కుమార గుప్తా, డీవో కటకం శైలజ, వైద్యులు టి.కల్యాణి, టి.వెంకటేష్, కె.లోవరాజు, టి.ప్రమీల, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి అవతార ప్రకటన ర్యాలీ

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి అవతార ప్రకటన ర్యాలీ వైభవంగా జరిగింది. 1940 అక్టోబర్ 20న సనాతన ధర్మ పరిరక్షణ కోసం తాను అవతరించానని సత్యసాయి మొట్టమొదట సారి ప్రకటన చేశారు. అప్పటి నుంచి సుమారు 150 దేశాల ప్రజలు ఈ రోజున అవతార ప్రకటన ర్యాలీలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెక్టార్–11 నుంచి వేదపఠనం, సర్వమత భజనలతో వివిధ సెక్టార్ల మీదుగా సెక్టార్–2, అక్కడ నుంచి పలు సెక్టార్ల మీదుగా సత్యసాయి మందిరానికి


ఉక్కునగరంలో సత్యసాయి ర్యాలీలో పాల్గొన్న భక్తులు

చేరుకుంది. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై నీటి నిల్వలు

అవస్థలు పడుతున్న వాహనచోదకులు


కూర్మన్నపాలెం నుంచి టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో ఆలిండియా రేడియో రిసీవింగ్ స్టేషన్ వద్ద నిలిచిన నీరు

అగనంపూడి: జాతీయ రహదారి నిర్మాణ సమయంలో పర్యవేక్షణ లోపించడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.వాటం (వాలు) ఎక్కువగా పెట్టడంతో వర్షపు నీరు హైవేపై రోజుల తరబడి నిలిచిపోతుంది. దీంతో భారీ వాహనాలు వెళ్లేటప్పుడు వెనుక వాహనాలపై నీరు పడుతోంది. కూర్మన్నపాలెం నుంచి టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో రెండు చోట్ల, కూర్మన్నపాలెం వద్ద నీరు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క గంగవరం పోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా చేసే లారీల నుంచి పడిన బొగ్గు రవ్వలు నీటిలో కలిసిపోయి నీరు మడ్డిగా మారుతోంది. ఆ నీరు తుళ్లి వాహనచోదకుల దుస్తులు నల్లగా మారిపోతున్నాయి. భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు స్పందించి నీటి నిల్వలు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఐసీఈయూ పోరాటాలు స్ఫూర్తిదాయకం

దాబాగార్డెన్స్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ 50వ స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు, సౌత్ సెంట్రల్ జోన్ నుంచి జోనల్ నాయకులు, పలు డివిజన్ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఐసీఈయూ 50 ఏళ్ల పూర్తి చేసుకున్నందుకు, కొత్త భవనం సమకూర్చుకున్నందుకు, యూనియన్ నాయకత్వానికి, సభ్యులకు అభినందనలు తెలిపారు. 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి దోహదపడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేటుపరం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఏఐఐఈఏ అందులో భాగమైన ఐసీఈయూ అనేక పోరాటాలు చేస్తూ, ఇన్సూరెన్స్ రంగంలోని ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయకుండా నిలువరించగలిగినట్లు తెలిపారు. ఈ ప్రస్థానంలో ఐసీఈయూ పాత్ర ఎంతో కీలకమన్నారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేయాలని ఏఐఐఈఏ చేస్తున్న పోరాటంలో భాగంగా కేవలం 22 రోజుల వ్యవధిలో సుమారు 400 మందికి పైగా ఎంపీలను కలిసి ప్రీమియంపై జీఎస్టీ వల్ల పాలసీదారులు ఎంతో నష్టపోతున్నారని వివరించడం ద్వారా విపక్ష నేతలు ఏకమై జీఎస్టీకి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో గళమెత్తారన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి , ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్, పెద్ద ఎత్తున యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

మద్యం దుకాణాలకు షాపులు కావలెను!

వ్యాపారుల వెతుకులాట

గాజువాక: మద్యం షాపుల ఏర్పాటు చేయడానికి అద్దె భవనాల కోసం వ్యాపారులు వెతుకులాట ప్రారంభించారు. నూతన మద్యం పాలసీ అమలైన నేపథ్యంలో ప్రభుత్వం కొత్త మద్యం దుకాణాలు కేటాయించింది. ఇప్పటికే కొన్ని దుకాణాలు ఏర్పాటయ్యాయి. మరిన్ని దుకాణాలు ప్రారంభించడానికి మద్యం వ్యాపారులు అద్దె భవనాల కోసం వేట ప్రారంభించారు. గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే 20 దుకాణాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం. గాజువాక, పారిశ్రామిక ప్రాంతంలో మొత్తం 50 దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రొవిజనల్ అనుమతులపై మద్యం దుకాణాలు ఏర్పాటైన విషయం తెలిసిందే. ఆయా దుకాణాలకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇచ్చిన తర్వాత కొత్త దుకాణాలపై కూడా స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజాహితాన్ని కోరే సంస్థలకు గుర్తింపు


ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఎంపికైన వారికి పత్రాలు అందిస్తున్న అతిథులు

అగనంపూడి: ప్రజాహితం కోసం పని చేసే సంస్థలకు గుర్తింపు లభిస్తుందని విశాఖ ఉక్కు విశ్రాంత జనరల్ మేనేజర్ దువ్వాడ రామ ప్రసాద్ అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ప్రేరణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రజల్లో ఆదరణ, గుర్తింపు ఉంటుందన్నారు. ప్రేరణ సంస్థ వ్యవస్థాపకుడు బాల బొమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ అసోసియషన్ ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తామన్నారు. ఉక్కు విశ్రాంత డీజీఎం కె.వి.రామారావు, బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, ప్రజా సంఘాల ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, డాక్టర్ నాయుడు, దాసరి జయలక్ష్మి,ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలకు రెక్కలు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారిగా నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు , మధ్యతరగతి ప్రజలు ఏం కొనలేక, తినలేక అవస్థలు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవనంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు నిత్యావసర సరకులు, కూరగాయలు కొనలేకపోతున్నారని... పెరిగిన ధరలను నియంత్రించకుండా కూటమి నాయకులు మా ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ తిరుగుతున్నారని మండిమడ్డారు. దళారులు నిత్యావసరాలు, కూరగాయల ధరలను పెరుగుదలను శాసిస్తున్నారని తక్షణమే దళారి వ్యవస్థలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక ప్రకటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు.ఇసుక అందుబాటులో లేక లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండా పస్తులుండే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో ఉద్యమం ద్వారా ప్రజల్లోకి వెళ్తామని హెచ్చరించారు. అప్పారి విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాజువాక శాఖ కార్యదర్శులు పల్లేటి పోలయ్య, కెంగువ అచ్చుతరావు, పి. దుర్గారావు, కె. వనజాక్షి, పి. పద్మ, పి. సోమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

నేడు ఉక్కు ఉద్యమ నేత అమృతరావు జయంతి

ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కీలక భూమిక పోషించిన దివంగత టి. అమృతరావు జయంతిని సోమవారం స్టీల్ ప్లాంట్‌లో నిర్వహించనున్నారు. గాంధీ మిషన్ ఆధ్వర్యంలో ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న స్మృతివనం వద్ద నిర్వహించనున్న వేడుకలకు ప్రజాప్రతినిధులు, వివిధ కార్మిక సంఘాలు నాయకులతో పాటు అమృతరావు మనుమడు టి. మోహన్ గాంధీ కూడా హాజరవుతున్నారు.స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం గుంటూరుకు చెందిన అమృతరావు విశాఖ కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి స్వయంగా వచ్చి అమృతరావుతో దీక్ష విరమింపజేశారు. ఈ నేపథ్యంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించడానికి కార్మిక సంఘాలు ఏర్పాట్లు చేశాయి.


ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద అమృతరావు విగ్రహం

ఉక్కు ఉద్యమానికి భెల్ సీఐటీయూ నాయకుల మద్దతు


అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం భెల్ సీఐటీయూ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీటూ నాయకుడు ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. ఎంతో మంది మహాత్ముల ప్రాణత్యాగాల ఫలితంగా వచ్చిన కర్మాగారాన్ని కాపాడుకోవడానికి అంతా సంఘటితంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేంద్రపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.నారపురెడ్డి, బి.ఎస్.ఎన్.రాజు, కె.కామేశ్వరరావు, ఎ.సీతామహాలక్ష్మి, జి.అచ్చెన్నాయుడు, కనకారావు, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


రిలేని నిరాహారదీక్షలో పాల్గొని నినాదాలు చేస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

ఆలయాల్లో విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరిపై కొలువైన శ్రీ బాల వినాయకునికి ఆదివారం హర సంకట చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి గరిక పూజలు, ఉండ్రాళ్ల నైవేద్యం సమర్పించారు. అర్చకులు చరణ్, మూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

● షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చనచేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల బాల వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడు

మొక్కేకదా అని వదిలేస్తే...

స్టీల్‌ప్లాంట్ వంతెనపై పొంచి ఉన్న ముప్పు

పెదగంట్యాడ: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. వారి వైఖరితో కీలకమైన నిర్మాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మండలంలోని గంగవరం పోర్టు, స్టీల్ ప్లాంట్ వంతెన గోడలపై మొక్కలు మొలిచాయి. వంతెన గోడల్లోకి చొచ్చుకు రావడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికలు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ వంతెనపై నుంచి వేలాది మంది స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉదయం నుంచి రాత్రి వరకూ రాకపోకలు సాగిస్తారు. అంతేకాకుండా ఈ వంతెన కింద నుంచి వేలాదిగా గంగవరం పోర్టు కార్మికులతో పాటు వాహనాలు ప్రయాణం చేస్తుంటాచి. దీంతో వారంత భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మొలిచిన మొక్కలను తొలగించి బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


గోడపై మొలిచి మొక్క

విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య బీమా

సీతంపేట : ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య విశాఖపట్నం విభాగం సమావేశం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు తక్కువ ప్రీమియంతో రూపొందించిన ఆరోగ్య బీమా పథకాన్ని కంపెనీ ప్రతినిధి నరసింహమూర్తి వివరించారు. పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు జీఎస్‌టీ తగ్గించాలని సభ్యులు కోరారు. సమాఖ్య తరపున ప్రతి నెలా సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని సభ్యులు నిర్ణయించారు. సమాఖ్య సహాయ కార్యదర్శి టంకాల కామేశ్వరరావు, సూర్య భాస్కర్, కేశవరావు, కృష్ణారావు, రవికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు

రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార : సమాజంలో అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో మెలగాలని ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి నుంచి వేలిముద్రలు సేకరించారు.